

అబ్బూరి వరద రాజేశ్వరరావు గారు, వారి సతీమణి ఛాయాదేవి గారు తెలుగు సాహితీ రంగంలో లబ్ధప్రతిష్ఠులు. ఆ రోజులలో వారింట్లోనో, ఎ.ఆర్.కృష్ణగారింట్లోనో సాయంకాలం అయేటప్పటికి వూళ్ళో వున్న సాహితీప్రియులంతా

సమావేశమయేవారు. ఒకసారి కృష్ణగారింట్లో మావారికి వరద రాజేశ్వరరావుగారితో పరిచయం అయింది. ఆ చూసుకున్న వేళా విశేషమేమిటో మేమిద్దరం వారికి ఆప్తులమయ్యాం. వారంలో కనీసం రెండు మూడుసార్లయినా వాళ్ళ ఇంటికి వెళ్ళేవాళ్ళం. వెళ్ళినప్పుడల్లా ఛాయాదేవి గారి చేతి వంట రుచి చూసేవాళ్ళం. అక్కడే మాకు కాళోజీ, అజంతా, రావిశాస్త్రి, బీనాదేవి, ఇస్మాయిల్, బూదరాజు రాధాకృష్ణ వంటి ఎందరో రచయితలు, సాహితీ మూర్తులు పరిచయం అయ్యారు. మా ఇద్దరికీ ఎటువంటి సాహితీ వ్యాసంగమూ లేకపోయినా మాకు వారింట్లోకి ఎటువంటి సమయంలోనైనా ప్రవేశం వుండేది. రోజు విడిచి రోజయినా రాజేశ్వరరావుగారు ఫోన్ చేసి 'వున్నారా' అని అడిగేవారు. వున్నారని చెప్పి ఈయన చేతికి ఫోన్ ఇచ్చి నేను తప్పుకునేదాన్ని. వాళ్ళిద్దరూ ఏవో కబుర్లు చెప్పుకునేవారు.

కానీ ఒకరోజు నేను ఫోన్ తీసి 'హలో' అనగానే 'వున్నారా' అని అడగలేదు. "మీతో ముఖ్యమయిన పని వుంది. ఇటువేపుకి వచ్చినపుడు మనింటికి రండి" అని ఫోన్ పెట్టేశారు. "ఏమిటబ్బా అంత నేను చేయగల పని?" అని ఒకింత ఆశ్చర్యంతోను, మరికొంత గర్వంతోను వాళ్ళ ఇంటికి వెళ్ళాను. రాజేశ్వరరావుగారంతటి వ్యక్తి నాతో పనుందంటే ఎంత గొప్ప! నేను వెళ్ళేటప్పటికి వాళ్ళిద్దరూ భోజనం చేస్తున్నారు. భోజనం విషయంలో ఆయనకి ప్రత్యేకమయిన అలవాటుండేది. ఉదయం తొమ్మిది గంటలకి కూరతోను, మధ్యాహ్నం ఒంటిగంటకి పప్పుతోను, రాత్రి 9.30కి మళ్ళీ కూర, పచ్చడితోను ఒక చిన్న కటోరీడు అన్నం తినేవారు. ఇడ్లీ, దోసె లాంటి టిఫిన్లు తినేవారు కాదు. ఆ వంట ఎంత శుచిగా, రుచిగా ఛాయాదేవిగారు చేసేవారో! శ్రద్ధని బట్టే రుచి వస్తుంది. ఆవిడలా పప్పు పులుసు కాచాలని నేను చాలా ప్రయత్నాలు చేశానుగానీ అలా అయితే కుదరలేదు.

ఆయన కుశల ప్రశ్నలయాక "ఏం లేదు! మన ఫ్రెండు ఏల్చూరి సుబ్రహ్మణ్యం అని మద్రాసులో వుంటారు. నాకు ఎన్నో సంవత్సరాల స్నేహం. నాకు అతనే వడుగు కూడా చేసాడు. వాళ్ళకి ముగ్గురబ్బాయిలు, ఇద్దరమ్మాయిలు. రెండో అమ్మాయి పెళ్ళికుంది. పాతికేళ్ళలోపు. ఎం.ఏ. పాసయింది. భరతనాట్యం నేర్చుకుంది. మనవాళ్ళల్లో కాస్త మంచి కుర్రాడుంటే చూడు. ఏదయినా మంచి సంబంధం వుంటే వాళ్ళు వచ్చి మిగతా విషయాలు చూసుకుంటారు" అన్నారు. తప్పకుండా కనుక్కుంటానని చెప్పాను.

ఆ రోజుల్లో నేను చాలా పెళ్ళిళ్ళు కుదిర్చాను. కొన్ని చేసాను కూడా. ఎప్పుడు ఏదో హడావిడి లేకపోతే నాకు తోచేది కాదు. ఆయన పెళ్ళికూతురి వివరాలు,

ఫొటో ఇచ్చారు. పెళ్ళి సంబంధాల గురించి నేను ఒక ఫైలు పెట్టుకున్నాను. అందులో పెళ్ళికావలసిన పిల్లల వివరాలు, ఫొటోలు వుండేవి. ఒక జన్మపత్రి నమూనా కూడా నేనే తయారు చేసి నాదగ్గరకొచ్చిన వాళ్ళని వాళ్ళ వివరాలు నింపమనేదాన్ని. అంటే పేరు, జన్మించిన తేదీ, తండ్రి పేరు, గోత్రం, విద్యార్హతలు, వరుడు-వధువులో వుండవలసిన క్వాలిఫికేషన్సు, ఇలా వుండేది. రాజేశ్వర్రావుగారిచ్చిన కాయితాన్ని ఫైలు చేద్దామని తీస్తే ఒక అప్లికేషన్లో కొన్ని వివరాలు కనిపించాయి. ఎవరబ్బా ఈ కాయితం నింపారు అని ఆశ్చర్యపోతూ చదివాను. తీరా చూస్తే దాన్ని నింపినది ఎర్రపెన్నుతో నా కూతురు. ఎలా రాసిందో తెలుసా, పేరు : శైలు, పుట్టినతేదీ : రాక్షసనామ సంవత్సరం, అర్థరాత్రి అమావాస్య, విద్య : పది పాసవచ్చు. పెళ్ళికొడుకు అర్హతలు : ఎవరైనా ఫరవాలేదు, పిచ్చి లేకపోతే చాలు. ఇంటి పేరు : సోమరిరాజు... వగైరాలు రాసి కింద రకరకాల బొమ్మలేసింది. దీన్నిబట్టి వూహించండి మా ఇంట్లో నా పనుల మీద ఎంత గౌరవమో!

మా పెద్దన్నయ్య కొడుకు అప్పట్లో నిజాం హాస్పిటల్లో డాక్టరుగా పని చేస్తుండేవాడు. మా ఇంట్లోనే వాడి మకాం. అందరం భోజనాలు చేస్తున్నపుడు రాజేశ్వర్రావుగారు చెప్పిన విషయం అన్నాను. వాడు నాతో వెంటనే "అత్తయ్యా మా ఛీఫ్‌కింకా పెళ్ళి కాలేదు. ఎయిమ్స్‌లో ఎం.డి. చేసారు. చాలా మంచాయన. మనవాళ్ళే. నువ్వు కనుక్కో" అన్నాడు. నాకు భలే సంతోషం వేసింది. అలా అనుకోగానే ఇలా మంచి సంబంధం కనిపించింది కదా అని. 'నువ్వు కనుక్కోరా, రమ్మంటే వెంటనే వెడతాను" అని చెప్పాను. ఎప్పుడయినా సరే లంచ్ టైములో రమ్మన్నారట. ఒక మంచి రోజు చూసుకుని ఒక్కదాన్నీ వెళ్ళి కలిశాను. ఆయన చాలా అందంగా, హుందాగా వున్నారు. చాలా మర్యాదగా మాట్లాడారు. వాళ్ళ అమ్మ, నాన్న, అమ్మమ్మ, తాతగారు వున్నారని, అన్నీ వాళ్ళ తాతగారే చూస్తారని చెప్పారు. వెళ్ళి కలవమన్నారు. తనకి పెళ్ళి విషయమై ఎక్కువ హడావిడి, ఆడంబరాలు ఇష్టం లేదని చెప్పారు. రిజిస్టర్డు మారేజి చేసుకుందామని తను అనుకుంటున్నానన్నారు.

మళ్ళీ మంచి రోజు చూసుకుని నేను, మా ఆయనా వాళ్ళ ఇంటికి వెళ్ళాం. అందరూ చాలా సాత్వికంగా వున్నారు. వాళ్ళు తూర్పుగోదావరి జిల్లా కోనసీమకు చెందినవారు. ర్యాలి గ్రామం. మరి నేను కూడా అంటే మా తాతగారు కూడా కోనసీమేగా! ఆయన కందికుప్ప అనే గ్రామానికి కరణంగా వుండేవారు. మా పొలాలన్ని అమ్మేసేటపుడు ఒక్కసారి మాత్రం నేను ఆ వూరు వెళ్ళాను అంతే! అయినా మీ వూరు ఏదంటే ఆ పేరే చెప్తాం కదా! ఇంక కోనసీమ పేరు వినగానే ఒకరకమైన

మానసిక బంధుత్వం ఏర్పడిపోయింది. నిజానికి పెళ్ళికూతురు మా అమ్మాయి కాదు కదా! అయినా అదంతే! పెళ్ళికొడుకు తాతగారు కొంచెం అంత ఆసక్తి లేనట్లుగా వున్నా అమ్మమ్మగారు మాత్రం చాలా వివరాలు అడిగారు. ఆవిడ మనిషి చాలా అందంగా పచ్చి పసుపుకొమ్ము లాగా వున్నారు. డాక్టరుగారికి బహుశా అవిడ పోలికే వచ్చిందనుకుంటా! ఆవిడే అన్ని వివరాలు కనుక్కున్నారు. పిల్లను చూస్తామనీ మద్రాసునుంచి పిలిపించమనీ చెప్పారు. అమ్మయ్య అనుకుని ఇంటికి చేరాం.

ఇంక నెమ్మదిగా నేను చెయ్యవలసిన పనులు మొదలు పెట్టాను. రాజేశ్వర్రావుగారు సుబ్రహ్మణ్యంగారికి ఫోన్ చేసి వెంటనే పిల్లను తీసుకురమ్మని చెప్పారు. మూడోరోజుకల్లా తండ్రీ, కూతురూ వచ్చారు. ఆ అమ్మాయి పేరు జానకీరాణి. అందరూ రాణి అని పిలుస్తారు. ఆయనకి ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. మన పెళ్ళికూతురు వారి రెండో అమ్మాయి. చామనచాయలో సన్నంగా సమాన ఎత్తులో వుంది. నవ్వుమొహం. చాలా నిదానస్థురాలు. తరువాత చూశానుగా, వాళ్ళ ఇంట్లో అందరూ చాలా నిదానంగా వుంటారు. ప్రియంగా మాట్లాడుతారు. తను ఎం.ఏ. సోషల్‌వర్కు చేశాననీ, ఏదో సేవాసంస్థలో పని చేస్తున్నాననీ చెప్పింది. మా ఇంట్లో అన్నిటికీ గట్టిగట్టిగా అరుచుకోడం (మా ఆయన ఇంట్లో లేకపోతే) అలవాటు కదా! కాస్త తక్కువగా, నెమ్మదిగా మాట్లాడేవాళ్ళంటే గౌరవం. వచ్చిన అయిదు పది నిముషాలకే తనూ, మా అమ్మాయీ మంచి స్నేహితురాళ్ళైపోయారు.

పెళ్ళికే ఏ హడావిడీ వద్దన్నారు కదా, ఇంక పెళ్ళి చూపులకి ఎందుకని అంతా సింపుల్‌గానే చేశాం. డాక్టరుగారూ, ఆయన తాతగారూ, అమ్మా, నాన్నగారూ వచ్చారు. అంతా వచ్చి పిల్లని చూసి వెళ్ళారు. డాక్టరుగారు పిల్లతో ప్రత్యేకంగా మాట్లాడుతానని ఏం అనలేదు. అసలు ఏమన్నా పలకరించారో లేదో కూడా గుర్తులేదు. అంతా కలిసి కాఫీలు తాగడంతో కూడా కలుపుకుని పది నిముషాల్లో అయిపోయింది. రెండురోజులు పోయాక తాతగారు ఫోన్ చేసి "సుబ్రహ్మణ్యం గారూ! మీ అమ్మాయికి మా అబ్బాయి నచ్చాడా" అని అడిగారు. నచ్చాడట అని ఈయన సమాధానం చెప్పగానే " అయితే మా మనవడికీ పిల్ల నచ్చింది. కానీ మా ఆవిడ పిల్లను చూడాలనుకుంటోంది. మీరు మా ఇంటికి రండి" అన్నారు.

మన పెళ్ళికూతురు బంగారు తల్లి రెండు ఆకుపచ్చ చీరలూ, ఒక బ్లౌజ్ మాత్రం తెచ్చుకుంది. అదేవిటంటే పెట్టెలో జాగా కలిసొస్తుందని ఆ పని చేసిందిట. మిగతావన్నీ చుడీదారు డ్రెస్సులే. సరే ఏం చేస్తాం. మళ్ళీ ఆ ఆకుపచ్చ చీరే కట్టుకుని బయలుదేరింది. తండ్రీ కూతురూ, మేమిద్దరం కలిసి వెళ్ళాం. మా ఆయనకి కూడా

చాలా వేషాలున్నాయి. నాకేదయినా పనుండి నాతో రమ్మంటే ఒక్కచోటకి రారు, ఒక్క ఫంక్షనుకి నాతో రారు కానీ ఇది మరి గురువుగారి పని కదా! ఒకటే వుత్సాహం. నాకన్నా ముందే తయారయి కూచునేవారు. పెళ్ళిచూపుల్లో ఎవరూ ఏమీ మాట్లాడలేదనుకున్నవన్నీ అమ్మమ్మగారు మాట్లాడారు. మొత్తం బంధువర్గపు విశేషాలూ, ఇంటిపేర్లూ అన్నీ కనుక్కున్నారు. పిల్లతో చక్కగా మాట్లాడారు. వాళ్ళ అమ్మగారు మాత్రం "ఏమ్మా! మొన్న మేము వచ్చినపుడు కూడా ఆకుపచ్చ రంగు చీర కట్టుకున్నావు. నీకు ఈ రంగంటే ఇష్టమా" అని అడిగారు. చూసారా! ఆడవాళ్ళ చూపు ఎంత నిశితంగా వుంటుందో! అందుకే పెళ్ళిచూపులకి తగినంతమంది ఆడవాళ్ళు వెళ్ళాలి. వాళ్ళ ఇల్లంతా చూపించారు. చాలా పెద్ద ఇల్లు. ఆ తాతగారికి డాక్టరుగారి తల్లి ఒక్కరే సంతానం. అందువల్ల వాళ్ళ ప్రాణాలన్నీ ఈ మనవడి మీదే! చూసేవాళ్ళెవరికయినా తేలికగా అర్థం అవుతుంది.

సుబ్రహ్మణ్యంగారు, రాణి మద్రాసు వెళ్ళిపోయారు. ఫిబ్రవరి పదహారుకి ముహూర్తాలు పెట్టుకున్నారు. రిజిస్టర్డు పెళ్ళి అయినా ముహూర్తం ప్రకారమే. డాక్టరుగారికి ఆడంబరాలు పోకూడదని తప్పితే హిందూధర్మం మీద ఏమీ వ్యతిరేకత లేదు. ఆ విషయం నేను డాక్టరుగారిని మొదటిసారి కలిపినప్పుడే అడిగాను "ఎందుకు రిజిస్టర్డు పెళ్ళి? సింపుల్‌గా మన పద్ధతిలోనే చేయవచ్చుకదా!" అని. దానికి ఆయన "మామూలు పెళ్ళి అనేటప్పటికి బోలెడు తంతులు, పద్ధతులు, వృధా పెట్టుపోతలు వుంటాయి. అవి నాకిష్టం వుండదు" అని చెప్పారు.

ఒక నెల్లాళ్ళ ముందుగా రాణి, వాళ్ళ నాన్నగారు మళ్ళీ వచ్చి రిజిస్ట్రారు ఆఫీసులో సంతకాలు చేసి అప్లికేషన్లు పెట్టుకున్నారు. ఈసారి రాణి వాళ్ళ అమ్మగారు కూడా వచ్చి పెళ్ళివారిని కలిశారు. పెళ్ళి మా ఇంట్లోనే మా హాల్లోనే జరగాలని నిశ్చయమైపోయింది. ఇంక రాజేశ్వర్రావుగారి సంతోషానికి అవధులు లేవు. సుబ్రహ్మణ్యంగారికీ, ఆయనకీ ఎన్నో దశాబ్దాల స్నేహం. ఇంక సాహిత్యపరమైన స్నేహం అంటే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తమకు తెలిసిన మిత్రులందరికీ పేరు పేరునా ఆహ్వానించారు.

మాకు ఇబ్బంది కలుగుతుందేమోనని సుబ్రహ్మణ్యంగారి కుటుంబానికి తగని మొహమాటం. మా వీధిలోనే నెల్లాళ్ళకోసం రెండు గదుల చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అక్కడే వుండి పెళ్ళి ఏర్పాట్లు చేసుకున్నారు. పిలుపులన్నీ వాళ్ళ పెద్దబ్బాయి మురళి చూసుకున్నాడు. పెళ్ళికి కావలసిన బట్టలు, నగలు అన్నీ మద్రాసులోనే కొనుక్కున్నారు. మగపెళ్ళివారు ఎంత వద్దన్నా మనకీ కొంచెం

మొహమాటం వుంటుంది కదా. డాక్టరుగారి ఇంట్లో వాళ్ళందరికోసం బట్టలు కొన్నారు. ఆయన మాత్రం తను ఏమీ తీసుకోనన్నా వీళ్ళయితే కొని వుంచారు. మరి ఆయనేం చేశారో నాకు జ్ఞాపకం లేదు. ఆ చిన్న ఇంట్లోనే వుంటూ వాళ్ళ చుట్టాలందరినీ పిలుచుకుని పెళ్ళి ఏర్పాట్లు చేసుకున్నారు. మా ఇంటికి దేనికీ వచ్చేవారు కాదు. ఒక్క పప్పురుబ్బుకోడానికి మాత్రం వాళ్ళ పెద్దమ్మాయి చిట్టి వచ్చేది. ఎంత బాగా రుబ్బేదో. అంతా తమిళుల పద్ధతే. అక్కడే పుట్టి పెరిగింది కదా! పైగా తను పదిమంది వున్న కుటుంబంలో కోడలు. చాలా మంచి స్నేహితురాలైంది మా అందరికీ.


మా ఇంటి గుమ్మాలన్నిటికీ తోరణాలు కట్టి ముందు ముగ్గులు పెట్టి అలంకారం చేశాం. పై డాబా మీద షామియానా వేసి ఒక వందమందికి సరిపడా టేబిళ్ళు, కుర్చీలు వేయించాం. ఇంక మన ఆస్థాన వంటాయన సత్యంగారుండనే వున్నాడు కదా. మగపెళ్ళివారు గోదావరి జిల్లా వాళ్ళు. పనసపొట్టు కూర చేయాలని చెప్తే అదెంత భాగ్యం అని స్వయంగా మార్కెట్లో పొట్టు కొట్టించుకుని వచ్చాడు. వేయించిన కందిపప్పు, దప్పళం, వంకాయ, పనసపొట్టు కూరలు, పులిహోర బూరెలు ఇలా అన్నీ గోదావరి జిల్లా వంటలే. మరి వాళ్ళే కదా మన అతిథులు. అయినా లడ్డు లేకుండా పెళ్ళేవిటని చిన్న చిన్న లడ్డూలు వడ్డనకని చేయించాం. వేడి వేడిగా వున్న ఆ బుల్లి బుల్లి లడ్డులని చూడగానే నాకే నోరూరి ఆ పళ్ళెం పట్టుకుని మా హాలులోకి వెళ్ళేటప్పటికి, అప్పుడే దండలు మార్చుకున్న వధూవరులతో సహా అందరూ తలా ఒకటీ నోట్లో వేసుకున్నారు. ఆ పెళ్ళికి వూళ్ళో వున్న పెద్ద పెద్ద రచయితలు, కవులు, పండితులు చాలామంది వచ్చారు. వరద రాజేశ్వర్రావుగారు, సుబ్రహ్మణ్యంగారు కలిసి పిలిస్తే రాకుండా ఎవరుంటారు? సరిగ్గా ముహూర్తం టైముకి నా శ్రేయోభిలాషి, నా స్నేహితురాలి తండ్రిగారైన మాజీ డి.జి.పి. శ్రీ ఎం.వి.నారాయణరావు గారు, పిన్నిగారూ వచ్చారు. ఇంక ఎ.ఆర్.బాజీగారు సరే సరి. వీరంతా నేను పిలిచిన అతిథులన్నమాట. ఆ తరువాత ఏ పెళ్ళిలో కనబడ్డా ఇంకా వేడిగా బుల్లి లడ్డూలు చేయిస్తున్నావా అని పలకరించేవారు. ఆ రోజు పిన్నిగారు వారిస్తున్నా వినకుండా మూడు లడ్డూలు తినేసారు మరి. గుర్తుండకుండా వుంటుందా!

ఆ పెళ్ళికి వచ్చిన వాళ్ళలో కాళోజీగారు కూడా వున్నారు. గుమ్మంలో కారు దిగుతూనే "వాకిట్లో నిలబడున్న సుబ్రహ్మణ్యంగారితో "మా వూరొచ్చి బిడ్డ పెళ్ళి చేసుకుంటు నన్ను పిలవకనేపోతివి! నా దోస్తు రంగారావు కారు పంపబట్టి రాగల్గినా"

అని వాదనేసుకున్నారు. నిర్ఘాంతపోయి మురళి చూస్తు వుండిపోయాడు. అప్పటికి నాలుగురోజులముందు మా ఆయనా, అతనూ వెళ్ళి స్వయంగా పిలిచి వచ్చారు మరి. అంటే ఆయనకి జ్ఞాపకశక్తి తగ్గిపోయందన్నమాట. ఇంక ఆయన రాగానే ఒకటే హడావిడి. సందడే సందడి. నవ్వులే నవ్వులు. అంతమంది కవి పండితులు అటువంటి శుభ సమయంలో కలిసినపుడు చతురోక్తులకేం తక్కువ! పరిహాసాలకేం తక్కువ! వధూవరులకి అందరూ అక్షతలు వేసాక హారతి ఇచ్చాం. ఆ తరువాత అందరం డాబా మీద చేరారు. ఆడవాళ్ళందరూ వడ్డిస్తుండగా బ్రహ్మాండంగా పూర్వకాలంలో జరిగినట్లు భోజనాలయ్యాయి. ఏవిటో! అదంతా ఒక కలలాగుంటుంది. లాగా వుండటమేమిటి? కలే! ఎన్ని కోట్లయినా సంపాదించవచ్చు. ఆ మనుషులెక్కడ్నించి వస్తారు? ఆ వైభవం ఎలా వస్తుంది. మనం పెట్టే ఖర్చుకీ, పొందే ఆనందానికీ పెద్ద సంబంధం వుండదని అలాటి పెళ్ళిళ్ళు నిరూపిస్తాయి. మధ్యాహ్నం కాఫీ టిఫిన్లయిపోయాక మగ పెళ్ళివారు అమ్మాయిని తీసుకుని వెళ్ళిపోయారు. ఆ సాయంత్రం డాక్టరుగారు తన మిత్రులకి రిసెప్షను ఇచ్చారు.

ఏల్చూరి సుబ్రహ్మణ్యం గారి అబ్బాయి మురళీధర్‌తో నాటి పెళ్ళి సంగతులు నెమరువేసుకుంటుంటే – నా మరుపుల్ని గుర్తు చేస్తూ విశేషాల్ని పొందికగా రాసి పంపారు. మధ్యలో మళ్ళీ నేనెందుకని యథాతథంగా వాటిని యిక్కడ ప్రక్షిప్తం చేస్తున్నాను.

## ఆనాటి తీపి ముచ్చట




1987 ఫిబ్రవరి 16 వ తేదీని డా॥ సోమరాజు రంగారావు, సుశీల దంపతుల స్వగృహంలో వారికి అత్యంత ఆప్తులైన ఏల్చూరి సుబ్రహ్మణ్యం గారి రెండవ కుమార్తె జానకీ రాణి వివాహం నిజాం హాస్పిటల్‌లో మైక్రోబయాలజీ ప్రొఫెసరుగా ఉద్యోగిస్తున్న డా॥ ర్యాలి రామలింగేశ్వరరావు గారితో హైదరాబాదులో జరిగింది. ఆ పెళ్ళిసంబంధం శ్రీ ఏల్చూరికి ఆత్మీయులైన శ్రీ అబ్బూరి వరదరాజేశ్వరరావు, శ్రీమతి అబ్బూరి ఛాయాదేవి దంపతులు, డా. సోమరాజు రంగారావు, సుశీల దంపతులు కలిసి కుదిర్చినదే. పెళ్ళి కళ్యాణమంటపంలో జరగటానికి వీలులేదని, హైదరాబాదులోని తమ స్వగృహంలోనే జరగాలని డా॥

సోమరాజు దంపతులు పట్టుబట్టి – ఎంతో ఔదార్యంతో అన్ని ఏర్పాట్లనూ స్వయంగా తామే దగ్గరుండి చూసుకొంటూ – ఏల్చూరి వారు మగపెళ్ళివారు, తామే ఆడపెళ్ళివారు, అది తమ కుటుంబంలోని వివాహమే అన్నంత నిండైన ప్రేమానురాగాలను కురిపిస్తూ, సుజనస్వజనులందరినీ తమ ఆప్యాయనామృతవర్షంతో ముగ్ధులను కావిస్తూ, కల్యాణోత్సవాన్ని అద్భుతావహ వైభవోపేతంగా నిర్వహించారు. వివాహానికి బంధుమిత్రులతోపాటు ఏల్చూరి, అబ్బూరి, సోమరాజు దంపతులకు సన్నిహితమైన హైదరాబాదులోని పాత్రికేయ కవిపండిత సమాజమంతా తరలివచ్చింది. అది వరుని ఆదర్శానుసారం రిజిస్టర్డు వివాహం కావటం వల్ల – డా॥ సోమరాజు దంపతులే ముందుగా రిజిస్ట్రారు గారి ఆఫీసులో కరణీయాలన్నింటిని పూర్తిచేయించి, ప్రాభాతిక మంగళవేళా సుముహూర్తాన తమ స్వగృహంలో ఆహూతులైన పెద్దల పునీతసమక్షంలో, బంధుమిత్రుల ఆనందసన్నిధిలో కల్యాణమంటపం ముందు మంగళవాద్యాల మంజుఘోషలు మార్మోగుతుండగా వైవాహిక మంగళసూత్రధారణాది విధివిధానాలను కూడా సంప్రదాయానుసారం నిర్వహింపజేశారు. ఆ వివాహ సమావేశానికి మహాకవి కాళోజీ నారాయణరావు గారు అధ్యక్షులుగా ఉండటానికి అంగీకరించి, ఆశీర్వాదపురస్సరంగా కల్యాణోపన్యాసం చేసి అందరినీ అలరింపజేయటం మా జీవితాలలోని అవిస్మరణీయ మధురస్మృతులలో ఒకటి.

ఆనాడు శ్రీ కాళోజీ గారు చిరంజీవిని సౌభాగ్యవతి జానకీ రాణి పెండ్లిలో పాల్గొన్న విశేషానికి సంబంధించి ఒక మరపురాని నేపథ్యజ్ఞాపకం ఉన్నది. శ్రీ కాళోజీగారు ఏల్చూరి సుబ్రహ్మణ్యం గారికి చిరకాల సన్నిహిత మిత్రులు. కాళోజీ గారి 'నా గొడవ' తొలి ముద్రణ సంపుటాల ఎడిటింగు పని ఆ రోజుల్లో హైదరాబాదులో ఉంటున్న సుబ్రహ్మణ్యం గారింటిలోనే జరిగింది. కాళోజీ గారి భావాభివ్యక్తి ప్రసిద్ధ లెబనీస్ మహాకవి ఖలీల్ జిబ్రాన్ కవిత్వాభివ్యక్తికిని సరిపోలి ఉన్నదని సుబ్రహ్మణ్యం గారన్నారట. కాళోజీ విస్తుపోయి, "ఆయననెవరు?"అని అడిగారట. అప్పుడు సుబ్రహ్మణ్యం గారు తమ గ్రంథాలయంలోని జిబ్రాన్ రచన 'ది ప్రాఫెట్'ను వెతికితెచ్చి కాళోజీ గారికిచ్చారట. లోకాకర్షణీయమైన ఆ మహాగ్రంథం ప్రభావానికి లొంగి కాళోజీ గారు'జీవనగీత' పేరుతో దానిని తెలుగుచేసి యువభారతి పక్షాన ముద్రించారు. 'జీవనగీత' ఎడిటింగు పనికూడా మద్రాసులో సుబ్రహ్మణ్యం గారింటనే ఒక నెలరోజులపాటు జరిగింది. వారిద్దరికీ ఉన్న అనుబంధం అటువంటిది మరి.

హైదరాబాదులో ఉండగా శ్రీ అబ్బూరి వరదరాజేశ్వరరావు గారితోడి భావబంధం

వల్ల, సహజమైన కవిత్వాభిమానం మూలాన కాళోజీ గారితోనూ, వారి మిత్రవర్గంతోనూ పరస్పర గౌరవపూర్వకమైన సన్నిహితత్వం, మైత్రి సంఘటిల్లాయి. అచిరకాలంలోనే ఆ మైత్రి అనుబంధంగా, ఆత్మీయతగా రూపుదిద్దుకొంది. ఆ కారణం వల్ల కుమార్తె పెండ్లి ఏర్పాట్లలో నిమగ్నులై ఉండిన ఏల్చూరి సుబ్రహ్మణ్యం గారు వివాహ శుభలేఖనిచ్చి తమ పెద్ద కుమారుడు మురళీధరరావును పంపగోరినప్పుడు డా॥ రంగారావు గారే అతనిని స్వయంగా కారులో కాళోజీ గారింటికి తీసికొనివెళ్ళారు.

వీరిద్దరూ ఇంటిలోనికి అడుగుపెట్టినప్పుడు కాళోజీ గారు ఒక మూలను నేలపై కూర్చొని 'ఆంధ్రప్రభ' వారపత్రికలో ఏదో కవితను చదువుతున్నారు. డా॥ రంగారావు గారిని, చిరకాలం తర్వాత తనను కలిసికొన్న ఏల్చూరి మురళీధరరావును ఎంతో ఆప్యాయనంగా పలుకరించి, తమకెంతో ప్రీతిపాత్రమైన జీడిపప్పు ఉప్మా ఫలహారాన్ని అందించి, కుశలప్రశ్నలడిగి, మిత్రుని కూతురి పెండ్లికి తప్పక రాగలనని మాటయిచ్చారు. వర్తమానకాలంలో అభ్యుదయకవిత్వపు తీరుతెన్నులను గురించి, సమకాలీన కవుల రచనలలోని సారనిస్సారతల గురించి తమ అభిప్రాయాలను నిస్సంకోచంగా వెల్లడించారు. 'నా గొడవ' రచన నాటి అనుభూతులను గురించి, తమ కవితావ్యాసంగాన్ని గురించి, రాజకీయోద్యమాలలో, ఎన్నికల రాజకీయాలలో తమ కర్తవ్యాన్ని గురించి ఎంతో ఆవేశంతో ప్రసంగించారు. ఉన్నట్లుండి – తమకు జ్ఞాపకశక్తి సన్నగిల్లుతున్నదని, ఒక క్షణంలో జరిగిన సంఘటన మరొక క్షణంలో గుర్తుండటం లేదని అన్నారు. 'ఆంధ్రప్రభ' పత్రికను చూపిస్తూ, "ఇదిగో, దీన్ని చదువుతున్నాను కదా, మొదటినుంచి కొసకు వచ్చేసరికి ఏం చదివానో మర్చిపోతాను. మళ్ళీ హాయిగా చదువుకుంటాను. కవితైనా ఒకటే, వ్యాసమైనా ఒకటే, మిర్చి బజ్జీ కట్టిన కాయితమైనా ఒకటే" అంటూ, చిలిపిగా నవ్వుతూ, వారిద్దరినీ హాయిగా నవ్వించారు.

ఈ మాటలను వింటున్న మురళీధరరావుకు అనుమానభయాందోళనలు ఏకకాలంలో కలిగాయి. చిన్నప్పుడు మద్రాసులో 'జీవనగీత' పరిష్కరణకోసం నెలరోజులున్నప్పుడు అలవోకగా చదరంగం ఆడుతూ, "నువ్వు నేషనలా? ఇంటర్నేషనలా? నీతో ఏనుగు పావును తప్పించి ఆడనా?" అని అడుగుతూ, ఒకేసారి ఇద్దరు ముగ్గురితో ఆడి ఆటకట్టించిన కాళోజీ గారికేనా, ఈ విస్మృతిరేఖ! అని ఆశ్చర్యం కలిగింది. "రేపటి కార్యక్రమానికి మీరు తప్పక రావాలి. నాన్నగారు, అమ్మ ఎదురుచూస్తుంటారు" అని, శుభలేఖను చేతిలో ఉంచి, మరీ మరీ అభ్యర్థించాడు. "సుబ్రమణ్యం కూతురి పెళ్ళికి నాకు ఆహ్వానమూ, పెళ్ళిపత్రికలూ

దేనికయ్యా, ముందు నేనే ఉంటానుగా అక్కడ" అంటూ కాళోజీ గారు మాటయిచ్చారు. ఇంటికెవరైనా వస్తే నేనే దీన్ని ఎవరికైనా ఇస్తాలే అనికూడా అన్నారు.

మరుసటిరోజు తెల్లవారుజాముననే డా॥ రంగారావు గారు బయలుదేరి -- తమ కారులో కాళోజీ గారిని, నగ్నముని గారిని కలుపుకొని, అక్కడి నుంచి జనార్ధనరెడ్డి గారి జీపులో అబ్బూరి దంపతులతో కలిసి వివాహగృహానికి అందరూ తరలివచ్చారు. అనుకొన్నట్లుగానే, కాళోజీ గారు చాలా నొచ్చుకొని, "అదేమిటయ్యా, సుబ్రమణ్యం కూతురి పెళ్ళికి పిలవలేదు అంత మర్చిపోయినాడా? అయినా మనము వెళ్ళక తప్పదు కదా" అని పెద్దరికపు సహృదయంతో వెంటనే బయలుదేరి వచ్చారు.

అప్పుడు జరిగిన సన్నివేశం మాకెన్నటికీ మరపురాదు. ఇంటిముందు స్వాగతవాక్యాలు పలుకుతున్న కూర్మినెచ్చెలి సుబ్రహ్మణ్యం గారిని చిరకాలలబ్ధమైన దర్శనానందంతో గాఢంగా కౌగిలించికొని, ఉచ్చైస్వరంతో -- నలుగురూ విని విస్తుపోతుండగా, "ఏమిటి సుబ్రమణ్యం, నీవాణి? అట్లా మర్చిపోయినావు? పొద్దుగాల రంగారావు చెప్పకుంటే ఏమయ్యేది? పోనీ, మురళినైనా పంపకపోయినావా?" అని ఒక్కుమ్మడిని కడిగిపారేశారు. ఇట్లా జరుగవచ్చునని అనుమానించినా, అట్లాగే జరిగినందుకు నోట మాటరాక తెల్లబోవటం మురళీధరరావు వంతయింది. ఎంతో చనవు ఉన్నప్పటికీ - మునుపటిరోజు ఉదంతాన్ని జ్ఞప్తికితెచ్చే ధైర్యం లేకపోయింది.

అంతలోనే కాళోజీ గారు ఇంటిలోనికి అడుగుపెట్టి, ప్రేమ తళుకొత్తే చల్లని చూపులతో, దీవెనలను కురిపించే మధురవాక్యాలతో నలుగురికీ కన్నులవిందుగా, వీనులవిందుగా అందరినీ పలుకరిస్తూ - వధూవరులను ఆప్యాయనంగా అక్కున చేర్చికొని ఆశీర్వదిస్తూ, ఉభయకుటుంబాల వారిని కుశలానుయోగాలడుగుతూ, "ఏమమ్మా, సుశీలగారూ, ఏమర్రా పిల్లలూ" అంటూ అందరితో తుల్యస్నేహంతో ప్రసంగిస్తూ పెండ్లిపెద్దగా నిలిచి, నవదంపతులతో పాటు ఇంటిల్లిపాదికీ తనివితీరా ఆశీస్సులను అందించిన సన్నివేశం ఆనాటి సభలో సభ్యులుగా పాల్గొన్నవారందరి జీవితాలలోనూ ఒక మహనీయమైన మధురస్మృతివిశేషం.

శ్రీ కాళోజీ గారు గొప్పకవి. ప్రజాహృదయాలలో శాశ్వతనివాసం ఏర్పరచుకొన్న సర్వాభ్యుదయకాముకులు. ఒకసారి వారితో పరిచయం కలిగితే చాలు - తనచుట్టూ ఉన్నవారికి ప్రేమను, అనురాగాన్ని, మంచితనాన్ని, మనశ్శాంతిని పంచియిచ్చిన మహావ్యక్తి. వారిని స్మరించుకోవడం ఎప్పుడూ ఆనందంగాను వుంటుంది.